సాక్షి అనకాపల్లి

ఆదివారం । 6 । ఆగస్టు । 2023

I



వచ్చే నెల 9న లోక్ అదాలత్

విశాఖ: వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు.



యూపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు

విశాఖ: ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 5 కేంద్రాల్లో 1,869 మంది పరీక్ష రాస్తున్నారు.



బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

విశాఖ: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది.

న్యూస్‌రీల్

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారి తశ్వీకశ్రీ



మెడల్, రికార్డు పత్రాలతో తశ్వీకశ్రీ

అనకాపల్లి టౌన్: గవరపాలేనికి చెందిన సీహెచ్ నరసింహమూర్తి, జ్యోతి దంపతుల కుమార్తె తశ్వీకశ్రీ అసాధారణ జ్ఞాపక శక్తితో రికార్డులు సృష్టిస్తోంది. రెండేళ్ల 10 నెలల వయసు గల ఈ బాలిక తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో 25 పద్యాలను వల్లె వేస్తుంది. 1 నుంచి 20 అంకెలు, 23 జంతువుల పేర్లు, 12 కూరగాయలు, 16 పండ్లు, 12 రంగులు, 6 వాహనాల పేర్లు, జాతీయగీతాలను టకటకా చెబుతుంది. 6 జంతువుల ధ్వనిని అనుసరిస్తుంది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ దృష్టిని ఆకర్షించి, అందులో చోటు సంపాదించింది.

9 నుంచి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సదస్సులు



సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ

దొండపర్తి: ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న శ్రీకాకుళం సర్కిల్ శ్రీకాకుళం రూరల్ సబ్ డివిజన్‌కు, 11న విశాఖపట్నం సర్కిల్‌లో అనకాపల్లి డివిజన్, యలమంచిలి సబ్ డివిజన్‌కు సంబంధించి ఆయా కార్యాలయాల్లో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అలాగే 18న విజయనగరం సర్కిల్‌లో పార్వతీపురం సబ్ డివిజన్‌కు, 22న రాజమండ్రి సర్కిల్‌లో జగ్గంపేట డివిజన్ ప్రత్తిపాడు సబ్ డివిజన్‌కు, 23న ఏలూరు సర్కిల్‌లో జంగారెడ్డి గూడెం డివిజన్ లోని కామవరపుకోట సబ్ డివిజన్‌కు సంబంధించి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చు.

'ప్రత్యేక మహిళా పోలీస్ చట్టం తీసుకురావాలి'



ముత్యాలనాయుడుకు వినతి పత్రం అందిస్తున్న మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

దేవరాపల్లి: ప్రత్యేక మహిళా పోలీస్ చట్టాన్ని తీసుకువచ్చి పోలీసులతో సమానంగా తమ సేవలు పూర్తి స్థాయిలో వినియోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా పోలీస్ వెల్ఫేర్ అసిసోసియేషన్ సభ్యులు కోరారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో మహిళా పోలీసులు (గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు)గా పని చేస్తున్న వీరు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును తారువలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రాష్ట్ర మహిళా పోలీస్ అధ్యక్ష, కార్యదర్శులు మహాలక్ష్మి, మధులత, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఉమ, జి. వరలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శిరీష, వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మ శేష నళిని, జాయింట్ సెక్రటరీ విజయభార్గవి తదితర్లు విలేకర్లతో మాట్లాడుతూ తమకు నిర్దిష్టమైన మాతృశాఖను ఏర్పాటు చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో కె.కోటపాడు, దేవరాపల్లి, సబ్బవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాల మహిళా పోలీసులు ఉన్నారు.

డాక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- కలెక్టర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన పెట్రోలియం అండ్ ఎనర్జీ యూనివర్సిటీ
- ఐటీడీఏ పీఓ, జేసీ, కలెక్టర్‌గా అందించిన సేవలకు గుర్తింపు



సతీమణి, ముద్దుల కూతురితో ఆనందం పంచుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సాక్షి, అనకాపల్లి: పరిపాలనా దక్షతకు గుర్తింపు వచ్చింది. అంకిత భావానికి కితాబు లభించింది. సేవాతత్పరతకు అరుదైన గౌరవం దక్కింది. పెట్రోలియం అండ్ ఎనర్జీ యూనివర్సిటీ తొలి గౌరవ డాక్టరేట్‌ను అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి ప్రదానం చేసింది. శనివారం విశాఖలో జరిగిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) మూడో స్నాతకోత్సవంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నెటిజం ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ గౌరవ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ అర్చన భట్టాచార్య డాక్టరేట్‌ను అందించారు. ఐటీడీఏ పీఓగా, జేసీగా, కలెక్టర్‌గా గిరిజనులకు అందించిన సేవలు, ఆయన హయాంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలన దక్షతకు గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. రవి పట్టాన్‌శెట్టి ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'స్వస్థ భారత్'లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అనకాపల్లి జిల్లా నుంచి అందుకున్న అవార్డును కూడా పరిగణనలోకి తీసుకున్నారు.

ఇనిస్టిట్యూట్ భూ వివాదం పరిష్కారంలో కీలక పాత్ర

పెట్రో యూనివర్సిటీ పునఃప్రారంభంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కీలక పాత్ర పోషించారు. తాత్కాలిక క్యాంపస్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఉండగా.. సబ్బవరం వంగలి గ్రామంలో వర్సిటీని నిర్మించేందుకు రూ.855 కోట్లు మంజూరయ్యాయి. దీనికోసం 201.08 ఎకరాల వరకు ల్యాండ్ పూలింగ్ చేశారు. మధ్యలో సుమారు 20 ఎకరాల వరకు రైతులు తమకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో అనకాపల్లి కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి నిర్వాసితులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీంతో హైకోర్టు వర్సిటీ నిర్మాణానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడం, పెట్రో యూనివర్సిటీకి అవరోధాలు తొలగిపోవడం జరిగింది. 2022 డిసెంబర్ 23న పనులు పునఃప్రారంభించారు. ప్రస్తుతం కాంపౌండ్ వాల్ నిర్మాణం చేశారు. పనులు కూడా జరుగుతున్నాయి.

చీపురుపట్టిన గ్రంథాలయ చైర్మన్



చీపురు పట్టి శుభ్రం చేస్తున్న గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ శేషగిరిరావు, జిల్లా చైర్‌పర్సన్ రమాదేవి

- 'మనం-మన గ్రంథాలయం'కు విశేష ఆదరణ
- సీఎం రూపకల్పన చేసిన కార్యక్రమం ఇది
- ఆయన ఆశయాలు నెరవేరుస్తాం
- రాష్ట్ర పౌర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ శేషగిరిరావు

నర్సీపట్నం: రాష్ట్ర పౌర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు చీపురు పట్టారు. జిల్లా చైర్‌పర్సన్ కొండా రమాదేవి ఆయనతోపాటు గ్రంథాలయాన్ని శుభ్రం చేశారు. 'మనం-మన గ్రంథాలయం'లో భాగంగా నర్సీపట్నం గ్రంథాలయంలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి నెలా మొదటి శనివారం గ్రంథాలయాలను ప్రక్షాళన చేసేలా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'మనం-మన గ్రంథాలయం' కార్యక్రమానికి రూపకల్పన చేశారని, ఆయన స్ఫూర్తితో ప్రతి నెల రాష్ట్రంలో ఏదో ఒకచోట పాల్గొంటున్నానని చైర్మన్ తెలిపారు. గ్రంథాలయంలో బూజు దులిపి, పుస్తకాలు సర్ది, గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేసి, పాఠకుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యా విధానంలో సీఎం తీసుకొచ్చిన మార్పు గ్రంథాలయ వ్యవస్థతో ముడిపడి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటలైజేషన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని శేషగిరిరావు చెప్పారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాల్లో డిజిటల్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, చిత్తూరులో సుమారు రూ.6 కోట్లతో నూతనంగా డిజిటల్ గ్రంథాలయాలను నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం సెస్సు రూపంలో గ్రంథాలయాలకు వచ్చే ఆదాయానికి గండి కొట్టిందన్నారు. సీఎం జగన్ సెస్సు విధానాన్ని పునరుద్ధరించడంతో సెస్సు రూపంలో గ్రంథాలయ సంస్థకు రూ.100 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. దీంతో గ్రంథాలయాల మరమ్మతులు, అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్, గ్రంథాలయ అధికారి దమయంతి, విశ్రాంత ఉద్యోగి త్రిమూర్తులురెడ్డి, పాల్గొన్నారు.

ఏయూ దూరవిద్య ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్- డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో 11 కోర్సులను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడానికి అనుమతి ఇచ్చిందని దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. పీజీ కోర్సుల్లో ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఇంగ్లిష్, యూజీ విభాగంలో బి.ఎ(హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), బి.కాం కోర్సులు అందిస్తామన్నారు. దరఖాస్తులు, ప్రవేశాల వివరాల కోసం www.andhrauniversity.edu.inను సందర్శించాలని సూచించారు. సెమిస్టర్ విధానంలో నిర్వహించే ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 31వ తేదీ ఆఖరు. రాష్ట్రంలో ఆన్‌లైన్ విధానంలో పీజీ, యూజీ కోర్సులు నిర్వహిస్తున్న తొలి విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు 0891 2844162, 2844164, 2754966లో సంప్రదించాలి.

'మోడల్' స్టేషన్‌గా అనకాపల్లి

- 'అమృత్ భారత్' ఎంపికతో మహర్దశ
- రూ.27.1 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి
- ఒకటో ప్లాట్‌ఫారం విస్తరణ, కాలినడక వంతెన నిర్మాణం
- రెండు ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు
- పనులకు నేడు శ్రీకారం



సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ అధికారుల బృందానికి సమస్యలు వివరిస్తున్న ఎంపీ సత్యవతి (ఫైల్)



అనకాపల్లి రైల్వే స్టేషన్

సాక్షి, అనకాపల్లి: అమృత్ భారత్ పథకంలో భాగంగా అనకాపల్లి రైల్వే స్టేషన్ ఒక మోడల్‌గా అభివృద్ధి చెందనుంది. రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లను ఆధునికీకరించడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేవిధంగా కేంద్రం నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 72 రైల్వేస్టేషన్లను ఎంపిక చేస్తే.. అందులో తొలిదశలో దక్షిణ మధ్య రైల్వే జోన్ విజయవాడ డివిజన్‌లో అనకాపల్లి సహా 11 స్టేషన్లు ఉన్నాయి. సుమారు రూ.27.1 కోట్లతో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా 53 రకాల మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. విశాలమైన ప్లాట్‌ఫాంలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఫర్నిచర్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒకటో ప్లాట్‌ఫారంను విస్తరిస్తారు. కాలినడక వంతెన నిర్మాణం చేపడతారు. అమృత్ భారత్ పనులకు ఆదివారం శ్రీకారం చుడతారు. ముఖద్వారం, ఎలివేషన్ నిర్మాణం, అదనపు సౌకర్యాలకు సంబంధించిన సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. ప్రయాణికుల సూచనలు, సలహాలను ఇప్పటికే స్వీకరించారు.

ఆధునికీకరణకు చర్యలు

అనకాపల్లి స్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దనున్నాం. ప్రస్తుతం ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలతోపాటు ఆధునికీకరణకు చర్యలు చేపడతాం. పాత ఫుట్‌పాత్ బ్రిడ్జిని తొలగించి దాని స్థానంలో 12 అడుగుల కొత్త ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించనున్నారు. స్టేషన్‌కు ఇన్, అవుట్ గేట్ల వద్ద టికెట్ సదుపాయం కల్పించనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఆదివారం పనులు ప్రారంభకానున్నాయి.

-వెంకటేశ్వర్లు, రైల్వే స్టేషన్ మేనేజర్, అనకాపల్లి

స్టేషన్‌లో కల్పించే ప్రధాన సౌకర్యాలు ఇవే...

అనకాపల్లి రైల్వేస్టేషన్ నుంచి జిల్లాలోని అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల వారు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. రోజుకు సగటున 6 నుంచి 7 వేల మంది వరకు ప్రయాణికులు ఇక్కడ నుంచి ప్రయాణిస్తుంటారు. 'ఏ' గ్రేడ్ స్టేషన్ గా వున్న అనకాపల్లిలో ఆ స్థాయిలో ప్రయాణికులకు తక్కిన సదుపాయలు లేవు. అమృత్ భారత్ స్టేషన్ పథకంతో స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.

- ప్రతి స్టేషన్‌లో ఆధునిక శైలిలో భవనాలు, ఫ్లోరింగ్ నిర్మాణం
- స్టేషన్ల వద్ద ట్రాక్‌ల శుభ్రత, మాడ్యులేట్ టాయిలెట్స్
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రెండు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు
- దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చెయిర్లు, ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ఇతర సదుపాయాలు
- వెయిటింగ్ హాల్స్, ఆధునిక లైటింగ్
- స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు, పార్కింగ్ ఏరియా, పాదచారులకు ప్రత్యేక దారి
- వేగవంతమైన 5జీ వైఫై సేవలు
- రెండు, మూడు ప్లాట్‌ఫాంల మధ్య ప్రయాణికుల వెయిటింగ్ హాల్, రూమ్స్, క్యాంటీన్, రిఫ్రెష్‌మెంట్ స్టాల్స్

రైల్వే శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు



అమృత్ భారత్ పథకం తొలి దశలో అనకాపల్లి రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేసి నిధులు మంజూరు చేసినందుకు నేను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి కృతజ్ఞతలు తెలిపాను. తొలిదశలో త్వరితగతిన పనులు పూర్తవుతున్నాయి. నేను 2021లో అనకాపల్లి రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలు, ఆధునీకరణ, అభివృద్ధి గురించి పార్లమెంట్‌లో మాట్లాడాను. ప్రత్యేకంగా రైల్వే మంత్రికి కూడా వినతి పత్రం అందజేశాను. సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ అధికారికి కూడా వినతి అందజేశాను. రైల్వే అధికారులు అనకాపల్లి స్టేషన్‌కు వచ్చి పరిశీలించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నేటి నుంచి పనులు ప్రారంభం కానున్నాయి.

- డాక్టర్ బి.వి.సత్యవతి, ఎంపీ

క్రిటికల్ కేర్‌తో సమర్థంగా అత్యవసర సేవలు

- భవన నిర్మాణానికి టెండర్లు పిలిచిన అధికారులు
- త్వరలో పనులు ప్రారంభం



ఎన్టీఆర్ వైద్యాలయం

అనకాపల్లి టౌన్: గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ రకాలైన వ్యాధులతో ఆస్పత్రికి వచ్చేరోగులకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం జిల్లాలో దశలవారీగా ఆస్పత్రులను అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం సమీపంలో ఎదురుగా ఉన్న ఆస్పత్రి స్థలం 1.1 ఎకరాల్లో క్రిటికల్ కేర్ యూనిట్‌ను రూ.22 కోట్లతో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ యూనిట్‌లో 50 పడకలను ఏర్పాటు చేయనున్నారు. నూతన భవన నిర్మాణానికి టెండర్లు పిలిచారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. అచ్యుతాపురం సెజ్‌లో గల వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ప్రమాదాలు జరిగే సమయాల్లో గాయపడిన వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలించే సమయంలో కొంతమంది మృత్యువాత పడుతున్నారు. అటువంటి సమస్యలు లేకుండా దగ్గరలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆస్పత్రి భవనాన్ని మూడు అంతస్తుల్లో నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నాలుగుబెడ్లతో డయాలసిస్ రోగులకు చికిత్స చేస్తారు. మొదటి అంతస్తులో రోగులకు కావలసిన పరికరాల నిమిత్తం రూ.7కోట్లతోను, మిగిలిన రూ.15 కోట్లతో భవననిర్మాణంతో పాటు, మౌలిక సదుపాయలు కల్పనకు, వైద్యులు, సిబ్బంది నివసించేందుకు చిన్నపాటి క్వార్టర్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు.

సకాలంలో మెరుగైన వైద్యసేవలు



దశలవారీగా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నాం. క్రిటికల్ కే ర్ యూనిట్ ద్వారా రోగుల కు మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందుతాయి. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ఆదేశాల మేరకు త్వరలో భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.22కోట్లు మంజూరయ్యాయి. రోడ్డుప్రమాదంలో తీవ్ర గాయపడిన వారికి, ఫార్మా కంపెనీ ల్లో జరిగిన ప్రమాదాల్లో బాధితులకు ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

- శ్రావణ్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్, అనకాపల్లి

నిత్యనూతన స్నేహబంధం

- స్థాయిలు వేరైనా మనసులు ఒక్కటే
- నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా



ప్రాణమిత్రులు: డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడితో ఉపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు

మాడుగుల: కలిసి చదువుకున్నారు. భావాలు పంచుకున్నారు. కష్టసుఖాల్లో తోడై నిలిచారు. వయసుతో పాటు స్నేహమూ పెరిగింది. స్థాయిలు వేరైనా ఇద్దరి మనసులు ఒక్కటే. అభిరుచులు ఒక్కటే. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న చిరికి శ్రీనివాసరావు స్నేహం వయసు నాలుగు దశాబ్దాలు. చిన్నప్పుడు ఎలా పిలుచుకునే వారో ఇప్పుడూ అలాగే.. ఓరేయ్ శ్రీనూ.. అంటే ఏం అన్నయ్యా అని బదులిస్తారు ముత్యాలనాయుడు. గిరిజన ప్రాంతాల్లో తన స్నేహితుడి పేరున దుప్పట్లు, రగ్గులు, దుస్తులు పంచిపెడతారు శ్రీనివాసరావు. ముత్యాలనాయుడు రాజకీయంగా ఎదగడంలో మిత్రుడి పాత్ర ఎంతో ఉంది. అందుకే ఆయన వీలున్నప్పుడల్లా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పలకరిస్తుంటారు. ఇద్దరికీ వైఎస్సార్ అంటే ఎంతో అభిమానం. పాదయాత్ర సమయంలో ఎస్.గజపతినగరంలో రాజశేఖరరెడ్డి ఎక్కడ నిద్రించారో.. అదే చోట శ్రీనివాసరావు మహానేత విగ్రహం ఏర్పాటు చేశారు. తన ఇంటి ప్రహరీ గోడల మీద ముత్యాలాయుడు బొమ్మలతో నింపేశారాయన. పదేళ్ల వయసులో తాతగారి ఊరైన కొత్తపెంటలో వారి చెలిమి ప్రారంభమైంది. ఇప్పటికీ అలా పచ్చగా కొనసాగుతోంది. అవసరాల కోసం కలిసిపోయి, చిన్న విషయాలకే విడిపోయే ప్రస్తుత సమాజంలో 40 ఏళ్ల స్నేహం అంటే మాటలా! అందరికీ స్ఫూర్తివంతంగా.. ఆదర్శ ప్రాయంగా మైత్రిని కొనసాగిస్తున్న ఈ ప్రాణ స్నేహితులకి శుభాకాంక్షలు చెబుదామా!

24 గంటల్లోనే కేసు ఛేదించారు

- కలిగొట్లలో రెండున్నర తులాల బంగారు నగ, రూ.4 వేలు చోరీ
- నిందితుడి అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నల్లపూసల దండ

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్లలో శుక్రవారం జరిగిన చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ డి. నాగేంద్ర శనివారం ఉదయం రంగంలోకి దిగి తమదైన శైలిలో విచారణ ప్రారంభించి 24 గంటలు గడవక ముందే నిందితుడ్ని పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ ఘటనకు సంబంధించి ఎస్ఐ వివరాల ప్రకారం.. కె.కోటపాడు మండలం సూరెడ్డిపాలెంకు చెందిన వనుము పాలవెల్లి నాలుగేళ్ల క్రితం తన భార్యతో కలిసి కలిగొట్లకు వలస వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వేచలంలో ట్రాక్టర్ యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ నెల రోజులు క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. అదే వీధిలో దొగ్గ పోతయ్యమ్మ శుక్రవారం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లి పోవడాన్ని అదునుగా భావించి పట్టపగలే తలుపు గడియను విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. బీరువాలో భద్రపరిచిన రెండున్నర తులాల బంగారు ఆభరణం(నల్లపూసల దండ)తోపాటు రూ.4 వేలు చోరీ చేశాడు. వీటితోపాటు బంగారు నగలు అనుకుని కొన్ని రోల్డ్‌గోల్డ్ వస్తువులను ఎత్తుకుపోయాడు. పొలం పనుల నుంచి సాయంత్రానికి ఇంటికి వచ్చిన పోతయ్యమ్మ తన ఇంట్లో చోరీని గుర్తించి అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ దర్యాప్తు ప్రారంభించి అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే చోరీ చేసిన సొత్తుతో పరారీలో ఉన్న పాలవెల్లిని శనివారం కాశీపురం కూడలి వద్ద అదుపులోకి తీసుకుని సోదా చేయగా చోరీ సొత్తు బయటపడింది. నిందితుడ్ని అరెస్టు చేసి చోడవరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ కేసును ఛేదించి సొత్తు రికవరీ చేసిన పోలీస్ సిబ్బందిని అనకాపల్లి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం

తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన విప్ ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: గ్రామ స్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవ్వాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. బుచ్చెయ్యపేటలో రూ.90 లక్షలతో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. సీఎం ఆశయం మేరకు ప్రతి ఒక్కరూ తమ సమస్యలను గ్రామ సచివాలయంలోనే పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సచివాలయ వ్యవస్థలో ఉందన్నారు. ఇక్కడ పరిష్కారం కానివి మాత్రమే మండల, జిల్లా స్థాయి అధికారుల వద్దకు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో పలు రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు రవాణాకు తీవ్ర అవస్థలు పడుతున్నారని, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. గంధవరం నుంచి రోలుగుంట వరకు భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రానికి 16 కిలోమీటర్లు దూరంలో బుచ్చెయ్యపేట మండలం అభివృద్ధి చెందాలని, కొమళ్లపూడిలో 50 ఎకరాలు ఎస్ఈజెడ్‌కు, మల్లాంలో రెండు వేల ఎకరాలు భూమిని ఏపీఎస్ఈబీకి ప్రభుత్వం కేటాయించిందని విప్ ధర్మశ్రీ తెలిపారు. రోడ్లు బాగోలేక కంపెనీలు రావడం లేదని, తక్షణమే వాటిని బాగు చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రాజాం నుంచి తట్టబంద రోడ్డుకు, పి. భీమవరం నుంచి గొన్నవానిపాలెంకు రోడ్డుకు, కొండెంపూడి నుంచి భీమవరం మార్గంలో ఎర్రిగెడ్డపై కల్వర్టుకు ఎన్ఆర్‌జీఎస్ నిధులు మంజూరు చేయాలని, రూ.16 కోట్లుతో బీఎన్ రోడ్డులో వెంకన్నపాలెం, గోవాడ, విజయరామరాజుపేట, బంగారుమెట్ట, శింగవరం, బుదిరెడ్లపాలెం గ్రామాల వద్ద సీసీరోడ్లు ఏర్పాటు కోసం ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలని కోరారు. రూ.60 లక్షల మేర పనులను స్థానికంగా చేసుకోవచ్చని, మండలంలో దెబ్బతిన్న రోడ్లుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంతోపాటు ఇతర శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ చేస్తామని, మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం సాయంత్రం ఆరు గంటల సమయంలో కలెక్టర్ స్థానిక నాయకులతో కలిసి దెబ్బతిన్న పెదమదీన, రాజాం రోడ్లును పరిశీలించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణ మూర్తి, గొంపా చినబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, డీపీవో శిరీషారాణి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు, డీఈ మోహనరావు పాల్గొన్నారు.

మూడు సబ్ డివిజన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

అనకాపల్లి టౌన్: జిల్లాలో మూడు సబ్ డివిజన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ వ్యతిరేకించిన వారిపై కేసులు నమోదు చేస్తామనిఎస్పీ కె.వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బహిరంగసభలు, ఊరేగింపులు, రహదారిపై కార్యక్రమాలు చేపట్టే వారు ముందస్తుగా రెవెన్యూ డివిజన్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో యాక్ట్ ప్రకారం చర్యలు చేపడతామన్నారు.

కుర్చీలు ఖాళీ.. సమాధానం నిల్



డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

అనకాపల్లి టౌన్: ఇదిగో ఈ ఫొటో చూశారా.. డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో శనివారం ఉదయం 11.05 గంటలకు తీసిన చిత్రం. సిబ్బంది ఇంకా హాజరు కాకపోవడంతో కుర్చీలు ఇలా ఖాళీగా కనిపించాయి. వివిధ ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చిన వారికి సమాధానం దొరకని పరిస్థితి ఏర్పడింది. సిబ్బంది సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మూవీ కిక్ కస్టమర్ కేర్ పేరిట మోసం

అనకాపల్లి టౌన్: మూవీ కిక్ కస్టమర్ కేర్ పేరిట సైబర్ మోసం చేయడంపై గ్రామీణ ఎస్ఐ నరసింగరావుకు శనివారం ఫిర్యాదు అందింది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సిరసపల్లి గ్రామానికి చెందిన ఎస్.నూకరాజు మూవీ కిక్ యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు చేస్తుంటాడు. ఇటీవల అతడికి మూవీ కిక్ కస్టమర్ కేర్ నుంచి ఫేక్ కాల్ వచ్చింది. మీ యాప్‌పై ఫ్రాడ్ జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని, దానిని క్లియర్ చేయడానికి ఓటీపీ పంపిస్తామని సైబర్ మోసగాడు నమ్మించాడు. ఆ మేరకు వచ్చిన ఓటీపీ కస్టమర్ కేర్ నంబర్‌కు షేర్ చేయడంతో నూకరాజు అకౌంట్ నుంచి రూ.54,799 మాయం కావడంతో బాధితుడు కంగుతిన్నాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిహారంపై తంతడిలో గ్రామ సభ

దరఖాస్తు చేసుకున్న అర్హులకు న్యాయం చేస్తాం: ఆర్డీవో చిన్నికృష్ణ

అచ్యుతాపురం (అనకాపల్లి): బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ కోసం అచ్యుతాపురం మండలంలో సేకరిస్తున్న భూముల పరిహారం అంచనా గురించి శనివారం తంతడిలో గ్రామ సభ నిర్వహించారు. అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ గ్రామ సభలో కొందరు తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సర్వే నంబర్ 238లో ఉన్న 318 ఎకరాలకు సంబంధించి అసలు సాగుదారులు, అనుభవదారులను గుర్తించేందుకు మూడేళ్ల క్రితం చేపట్టిన రీ-సర్వే అనంతరం లబ్ధిదారుల జాబితా ప్రదర్శించలేదనేది ఆందోళనకారుల వాదన. జాబితాతోపాటు, మ్యాప్‌ను విడుదల చేయాలని కొందరు డిమాండ్ చేయగా, భూమి హక్కుదారులై ఉండి తమను జాబితాలో చేర్చాలని వినతి పత్రం సమర్పించిన వారికి సంబంధించిన సర్వే చేపడతామని ఆర్డీవో చిన్నికృష్ణ వెల్లడించారు. వచ్చే వారం సర్వే చేస్తామని, దీనికి కొత్త బృందాన్ని నియమిస్తామని తెలిపారు. సచివాలయం ముందు జాబితా ప్రదర్శించాలని, మ్యాప్ విడుదల చేయాలని కొందరు నినాదాలు చేశారు.

రైలు ఢీ కొట్టి వ్యక్తి మృతి



రైలు ఢీ కొట్టడంతో మృతి చెందిన సేవ శ్రీకాంత్

పాయకరావుపేట: నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన శనివారం ఉదయం 11 గంటల సమయంలో రైలు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్లు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. పట్టణానికి చెందిన సేవ శ్రీక్రాంత్ (31) అనే వ్యక్తిగా గుర్తించడం జరిగిందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచి, మృతుని బంధువులకి సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్త్రీనిధి, సీఐఎఫ్ నుంచి రూ.20 లక్షలకుపైగా దుర్వినియోగం

టి.అర్జాపురం వీవోఏ నాగమణిపై కేసు నమోదు



కొత్తకోట ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న వెలుగు అధికారులు, సిబ్బంది

రావికమతం: మండలంలోని టి.అర్జాపురం గ్రామ సంఘం-2లో వీవోఏగా పని చేస్తున్న రాజాన నాగమణిపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు శనివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వీవోఏ నాగమణి స్త్రీనిధి సొమ్ము, సామాజిక పెట్టుబడి నిధి సొమ్ము కనకదుర్గ సంఘం నుంచి ఈ ఏడాది జనవరి 31న రూ.3,50,000 మంజూరు కాగా వేర్వేరు పేర్లతో సభ్యులు కాని వారికి బదిలీ చేసింది. అయ్యప్పస్వామి సంఘం నుంచి మరో రూ.3,50,000, సోనియా సంఘం నుంచి రూ.2,00,000, వేర్వేరు పేర్లకు మళ్లించింది. గ్రామ సంఘంలోని సభ్యుల నుంచి రూ.11,70,142 రికవరీ చేసి ఆ మొత్తాన్ని నాగమణి సొంతానికి వాడుకుంది. సీఐఎఫ్ రూ.2,50,000 సభ్యుల నుంచి వసూలు చేసి మండల సమాఖ్యకు చెల్లించలేదు. మొత్తంగా రూ.20 లక్షలకుపైగా సొమ్మును సంఘాలకు తెలియకుండా తన సొంత ఖాతాకు మళ్లించింది. దీనిపై వెలుగు అధికారులు విచారణ చేయగా వాస్తవమని తేలినప్పటికీ సొమ్ము చెల్లించనందున ఆమెపై చర్యలు తీసుకోవాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు విశాలాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు ఏఎంఏఎల్ పూర్వ విద్యార్థుల కలయిక



గత ఏడాది కలుసుకున్న స్నేహితులు(ఫైల్)

అనకాపల్లిటౌన్: స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో బీఎస్సీ చదివిన(1963–66 బ్యాచ్) పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గాజువాకలో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి పదవీవిరమణ పొందిన స్నేహితులందరూ కలుసుకోనున్నారు.

మహా భారతంపై పోటీలు

అనకాపల్లి రూరల్: మహా భారతంపై విద్యార్థులకు ఈ నెల 20న వ్యాసరచన, 27న వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు తెలుగు భాషా పరిరక్షణ సమితి సమన్వయకర్త కొయిలాడ రామ్మోహన్‌రావు,సహ సమన్వయకర్త జి.రంగబాబు తెలిపారు.పట్టణంలోని రింగురోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఈ పోటీలు సబ్ జూనియర్,జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉంటాయన్నారు.వ్యాసరచన పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మాత్రమే వక్తృత్వ పోటీలో పాల్గొనేందుకు అనుమతిస్తామని తెలిపారు. రాంకీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల29న వివేకానంద ఫంక్షన్ హాలులో బహుమతులు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9849345060, 9182873598, 9550234204 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి



సత్యనారాయణపురంలో జగనన్న కాలనీ పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

అనకాపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రభుత్వాన్ని కోరారు.సీపీఎం నేతలతో కలిసి శనివారం ఆయన మండలంలోని సత్యనారాయణపురంలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నేత ఎ. బాలకృష్ణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, రాజు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	రాజా
మెగ్ 2	సత్యనారాయణ స్క్రీన్-1
సూర్య S/O కృష్ణన్(మార్నింగ్, మ్యాట్నీ షోలు)	
దిల్‌సే	సత్యనారాయణ స్క్రీన్-2
కృష్ణగాడు అంటే ఒకరేంజ్	షిర్డిసాయి
బ్లడ్-చాక్లెట్	పర్తిసాయి
ఎల్‌జీఎం(లెట్స్ గెట్ మ్యారీడ్)	వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	శ్రీసత్య
బ్రో	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 57 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,850	4,300
మూడోరకం	3,800	3,800

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, ఎ నెగిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-26 యూనిట్లు, ఒ పాజిటివ్ 23 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 332 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ 9441108144)ని సంప్రదించవచ్చు.

పల్లె గడపలో ప్రగతి వీచిక



కొత్తూరులో వేస్తున్న తాగునీటి కుళాయిల పైప్‌లైన్లు



గడపగడపకు మనప్రభుత్వం నిధులతో పూర్తిచేసిన సీసీ రోడ్డు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'తో సమస్యల పరిష్కారం
- అనకాపల్లి మండలంలో రూ.5.2 కోట్లతో పనులు

తుమ్మపాల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతి పల్లెకు వరాలను తీసుకొస్తోంది. పల్లెల్లో తాగునీరు, డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం, ఇతర దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు అన్ని శాఖల మండల అధికారులు నేరుగా ప్రజల ఇంటి వద్దకు వెళ్లడంతో అనేక సమస్యలకు తక్షణ పరిష్కారం లభించడంతో పాటు గ్రామాలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయి. అనకాపల్లి మండలంలో 26 సచివాలయాలకు గాను ఇప్పటికే 22 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విజయవంతంగా పూర్తిచేశారు. ఒక్కో సచివాలయం పరిధిలో రెండు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించి అత్యంత ప్రాధాన్యత కలిగిన సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు తక్షణమే ఆదేశాలు ఇస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే కార్యక్రమం పూర్తయిన 10 గ్రామసచివాలయాల పరిధిలో నిధులు మంజూరవడంతో పనులు జరుగుతున్నాయి. మరో 9 గ్రామసచివాలయాల్లో పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేశారు. నాలుగు గ్రామసచివాలయాల్లో పనులపై ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మండలానికి రూ.5.2 కోట్లు

గడగపడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున అనకాపల్లి మండలంలో మొత్తం 26 గ్రామ సచివాలయాలకు రూ.5.2 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే పూర్తయిన 22 గ్రామ సచివాలయాల్లో పనులు చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మొదటి దశలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన 10 గ్రామసచివాలయాల పరిధిలో కొత్తూరు, కూండ్రం, మార్టూరు, తుమ్మపాల-1, అక్కిరెడ్డిపాలెం, బవులువాడ, కుంచంగి, వెంకిపాలెం, ఊడేరు, కోడూరుల్లో పనులు జరుగుతున్నాయి. రెండవ దశలో గోపాలపురం, కొత్తూరు-2, మారేడుపూడి, సత్యనారాయణపురం -1,2, తుమ్మపాల-3, గొలగాం, మామిడిపాలెం, పాపయ్యపాలెం సచివాలయాల పరిధిలో చేపట్టవలసిన పనులపై ఇప్పటికే తీర్మానాలు చేసి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించారు. రేబాక, సీహెచ్ఎన్.అగ్రహారం, శంకరం గ్రామాల్లో పనులపై ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ గ్రామాల్లో త్వరలో పనులు చేపట్టేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పిసినికాడ, సంపతిపురం, తగరంపూడి, తుమ్మపాల-2 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించవలసి ఉంది.

సీసీ రోడ్డుతో మేలు

కొండ వాగులా ఉండే దారిలో సీసీ రోడ్డు వేయడంతో అందరికీ మేలు జరిగింది. మా ఇంటికి వెళ్లాలంటే గోతులతో ఉండే దారిలో ద్విచక్రవాహనాన్ని నడిపించలేక తీవ్ర ఇబ్బందులు పడేవాడిని. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లాం. వెంటనే స్పందించిన ఆయన రోడ్డు మంజూరు చేశారు.

– బి.వి.రాజు, మార్టూరు

తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చే రూ.20 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కారం, డ్రైనేజీల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి ప్రజలు అనేక సమస్యలను తీసుకువస్తున్నారు. చేపట్టిన పనులకు తక్షణమే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. త్వరలో అన్ని గ్రామాల్లో పనులు పూర్తిచే స్తాం.

– డి.నరసింహారావు, ఎంపీడీవో, అనకాపల్లి మండలం

నేడు బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం



వాకింగ్ చేస్తున్న బెస్ట్‌ఫ్రెండ్స్‌క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్నేహం జీవనయానంలో ఒక అపురూప బంధం. కష్ట సుఖాలతోపాటు మానసికంగా దగ్గర చేసే బంధమే స్నేహం. ఇలా ఒక్కటైన స్నేహితులు అనకాపల్లిలో బెస్ట్‌ఫ్రెండ్స్‌క్లబ్ పేరిట పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరు కులమతాలకు, పార్టీలకు అతీతంగా క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ప్రతి ఏడాదీ చేపడుతున్నారు. బెస్ట్‌ఫ్రెండ్స్‌క్లబ్‌ను డిసెంబర్ 2001లో 50మంది స్నేహితులతో మాదేటి ఈశ్వరరావు, పెంటకోట నర్సింగరావు, బుద్దరాము, కర్రిగంగాధర్, బుద్ద శ్రీను, రామకృష్ణలు కలిసి స్థాపించారు. ప్రతి ఏడాదీ మూడు సందర్భాల్లో క్లబ్ సభ్యులు కలుసుకుంటారు. స్నేహితుల దినోత్సవం రోజున 418 కుంటుంబాల సభ్యులు కలుసుకుని, కష్టసుఖాలు తెలుసుకుని స్నేహ మాధుర్యాన్ని పంచుకుంటారు. ఈ ఏడాది స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఆదివారం వేడుకలు నిర్వహించేందుకు ఇప్పటికే ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అదేరోజు వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలతో అందరూ ఒకే కుటుంబంలా సందడి చేస్తారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల ముందుగా క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో వారానికి ఒక రోజు క్రీడల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం క్లబ్ స్థాపించినప్పటి నుంచి వస్తోంది. ఏడాదిలో రెండు నెలలు సుమారుగా 60 స్నేహితులు విహారయాత్రగా కాశీ, గోవా, శ్రీశైలం, తమిళనాడు, కశ్మీర్ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగను పురస్కరించుకుని నాలుగువారాలు అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఉచితంగా మజ్జిగ, ప్రసాదం పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి జరిగే నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. కార్తీక మాసంలో అన్నసమారాధన జరుపుతా రు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే మదర్స్‌డే కార్యక్రమాల్లో తల్లులను గౌరవిస్తారు. బెస్ట్‌ఫ్రెండ్స్‌క్లబ్ చైర్మన్‌గా బీఎస్ఎంకె.జోగినాయుడు వ్యవహరిస్తున్నారు.

మహిళ అదృశ్యం

కశింకోట: స్థానిక హౌసింగ్ కాలనీకి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. కొల్లి మహాలక్ష్మి(47) అనే మహిళ అలిగి శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు తెలిపారు. కుమారుడు పరమేశ్వరరావు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రేపు చేనేత దినోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం సచివాలయం మేడపై సోమవారం చేనేత దినోత్సవం నిర్వహించనున్నట్టు చేనేత కో ఆర్డినేటర్ సూరిశెట్టి సూరిబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి చేనేత వృత్తిదారులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

అమరవీరుల జ్ఞాపకార్థం శిలాఫలకం



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక : వాడ్రాపల్లిలో అమరవీరుల జ్ఞాపకార్థం శిలాఫలకం ఏర్పాటుకు సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు శనివారం భూమిపూజ చేశారు. నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సచివాలయం ఆవరణలో శిలాఫలకం ఏర్పాటు చేస్తున్నట్టు సర్పంచ్ నూకరాజు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఈఆర్‌వో రామలక్ష్మి

నక్కపల్లి: ఓటర్ల జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, చేర్పుల విషయంలో బీఎల్‌వోలు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్‌అధికారి రామలక్ష్మి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొంతమంది బీఎల్‌వోలు సెలవుపెట్టడం,ఆలస్యంగా రావడం, ఈఆర్‌వో అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకపోవడం, వారిదగ్గర సరైన వివరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశానికి హాజరుకాని బీఎల్‌వోలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. ఫారం6,7,8లు నింపే విషయంపై ఆమె కొంతమంది బీఎల్‌వోలను ప్రశ్నించారు.సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్లనుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా బీఎల్‌వోలపై వేటు తప్పదన్నారు. నియోజకవర్గంలో 12,000 మంది కొత్త ఓటర్లను చేర్చాల్సి ఉందన్నారు. తమ అనుమతి లేకుండా బీఎల్‌వోలకు ఎటువంటి సెలవులు మంజూరు చేయొద్దని ఎంఆర్‌వో, ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీలు పాల్గొన్నారు.

హృద్రోగి కుటుంబానికి రూ.25 వేల సాయం



రామకృష్ణ కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న యువకులు

మునగపాక:అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హృద్రోగి దొడ్డి రామకృష్ణ కుటుంబ సభ్యులకు కొంత మంది యువకులు శనివారం రూ.25వేల సాయం అందజేశారు. రామకృష్ణ గుండెమార్పిడి చికిత్సకు అవసరమయ్యే సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జగనన్న కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

యలమంచిలి: జగనన్న కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. మండలంలో ఏటికొప్పాకలో జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము మాట్లాడుతూ విద్యుత్, నీరు, వీధి దీపాలపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రవి, జేఈ సోమశేఖర్,హౌసింగ్ ఏఈ క్రాంతి,సచివాలయం కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



లక్ష్మికి ఫింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్

అచ్యుతాపురం(అనకాపల్లి): సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు విశేషంగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం వ్యయప్రయాసలకోర్చి వెళుతున్నారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు గ్రామానికి చెందిన ప్రగడ లక్ష్మి విశాఖపట్నంలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ దేశంశెట్టి సురేష్ అక్కడకు వెళ్లి ఆమెకు ఫింఛన్ అందజేశారు.

ఆరోగ్యకరమైన పంటల కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వామినాయుడు

కశింకోట: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించడానికి అందరూ కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయం అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆర్.స్వామినాయుడు కోరారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల ఓబీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రామ స్వయం సహాయక సంఘాల ఓబీలు తమ పరిధిలో ఉన్న పంట భూములు,పెరటి స్థలాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కూడా ప్రకృతి వ్యవసాయం చేయించాలని తెలిపారు. ఆరోగ్యకరమైన పంటలు పండించి, అందరికీ సరఫరా చేయాలన్నారు. ఇళ్ల వద్ద కిచెన్ గార్డెన్‌లను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డివిజన్ అధికారి ధర్మారావు, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, కశింకోట మండల మహిళాసమాఖ్య అధ్యక్షురాలు అరుణ పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు



నులి పురుగుల నివారణ మందులు అందజేస్తున్న సర్పంచ్ గున్నయ్యనాయుడు

కశింకోట: ప్రభుత్వం సరఫరా చేసిన నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులందరికీ పూర్తి స్థాయిలో అందేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యా, ఆరోగ్య శాఖ అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాలల ఉపాధ్యాయులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మాత్రలను విద్యార్థులు వేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద మాట్లాడుతూ ఈ నెల 10న నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలల విద్యార్థులకు మాత్రలు అందజేయనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్, వైద్య ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, ఎంఈవో చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

21 వరకూ ఓటర్ల సర్వే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: ఇంటింటి ఓటరు సర్వేను ఈనెల 21వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఆర్డీవో ఎ.జె. చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక గాంధీనగర్ జీవీఎంసీ కల్యాణమండపంలో శనివారం నియోజకవర్గంలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 251 మంది బీఎల్‌వోలు, 25 మంది సూపర్‌వైజర్లు ఓటరు సర్వేలో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఒకే డోరు నంబరులో ఎక్కువ మంది ఓటర్లు ఉన్నట్టయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ వై.శ్రీరామూర్తి, జెడ్పీ ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో ప్రారంభ దశలో క్యాన్సర్ గుర్తింపు

అనకాపల్లిటౌన్: క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తించడంలో స్క్రీనింగ్ సహాయపడుతుందని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి పరిశోధనా కేంద్రం(అగనంపూడి) ప్రివెంటివ్ అంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ డోల్‌రోసా ఫెర్నాండేజ్ తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయంలో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో శనివారం క్యాన్సర్ ఉచిత నిర్ధారణ పరీక్షలు, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ తీవ్రమైన సమస్య అని, చికిత్స చేయకుండా వదిలేస్తే మరణానికి దారితీయవచ్చన్నారు. ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగిన చికిత్స చేయించుకోవాలని ఆమె సూచించారు. వారసత్వంగా క్యాన్సర్ వ్యాధి ఐదు శాతం మందికి సోకుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్ మరణాలు పేద, మధ్యతరగతి దేశాల్లోనే సంభవిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రొమ్ము, మెడ, తల, గర్భాశయం, పొగాకు సంబంధిత, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, పేగులు, శ్వాసనాళాల్లో క్యాన్సర్, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిని గుర్తించే మార్గాలు, ప్రమాద కారణల గుర్తించి ఆమె వివరించారు. అనంతరం 70మందికి రొమ్ము, గొంతు, తల, గర్భాశయం, నోరు మొదలకు పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో హోమీబాబా ఆస్పత్రి వైద్యుడు తరుణ్, గౌరీగ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, సభ్యులు మళ్ల బాపునాయుడు, భీశెట్టి కృష్ణఅప్పారావు, బొడ్డేడ జగ్గఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

యలమంచిలి: రహదారి భద్రత నియమాలను అందరూ తప్పక పాటించాలని వైఎస్సార్ సీపీ యలమంచిలి మండల నాయకుడు, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త రాము అన్నారు. ఏటికొప్పాకలో రహదారి భద్రత నియమాలపై స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. అనంతరం డీఆర్‌డీఏ సిబ్బంది రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యాక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రవి,ఈవోలు తల్లిబాబు, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ లేకుండా భవన నిర్మాణాలు

మునగపాక : నాగవరం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు కోరారు. మండలంలోని నాగవరంలో జరుగుతున్న విలేజ్ హెల్త్ క్లినిక్ పనులను శనివారం పరిశీలించారు. ప్రజారోగ్యంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, గ్రామంలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భవన నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ లేకుండా చూడాలన్నారు.

వెంకన్న క్షేత్రానికి భక్తుల తాకిడి



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నక్కపల్లి: ఉపమాక వెంకన్నను శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు నిత్యార్చనలు చేసిన అనంతరం కొండదిగువన ఉత్సవమూర్తులకు, ఆండాళ్లమ్మవారికి, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామివారికి నిత్యపూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 500 మందిఅన్నప్రసాదం స్వీకరించినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన సేవలు : డీఎంహెచ్‌వో



తిమ్మరాజుపేటలో సూచనలిస్తున్న జిల్లా ఆరోగ్య శాఖ అధికారి హేమంత్

మునగపాక : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి ఎ.హేమంత్ కోరారు. తిమ్మరాజుపేటలో శనివారం జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని ఆయన పరిశీలించి సూచనలు అందించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుందన్నారు. చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలో ఇంతవరకు ప్రజలకు అందిన వైద్య సేవల గురించి వైద్యాధికారి ఎస్తేర్‌రాణిని అడిగి తెలుసుకున్నారు.

అరబుపాలెం పాఠశాలలో గాంధీ విగ్రహం ఏర్పాటు

మునగపాక : ప్రతి ఒక్కరూ జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు పాటుపడాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అరబుపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం మహాత్మాగాంధీ విగ్రహాన్ని నెలకొల్పారు. ఇటీవల అనకాపల్లి స్విమ్మింగ్‌పూల్‌లో ఈత నేర్చుకుంటూ మృత్యువాతకు గురైన రాపేటి పవన్ వెంకట్ జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఎస్.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.